# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు.
2. డా. బీఆర్ అంబేద్కర్ దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగం రూపొందించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
3. జూన్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.
4. బ్రిటీష్ వారిపై బిర్సా ముండా చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.
5. జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.

==========================

ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పేర్కొంటూ..

వాయిస్ .. 33 సెకన్లు

డా. బీఆర్ అంబేద్కర్ దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగం రూపొందించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ...

వాయిస్ .. 35 సెకన్లు

--------------------------

రానున్న ఐదేళ్లలో 50 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మంత్రులు, అధికారుల సమిష్టి కృషితోనే భాగస్వామ్య సదస్సు విజయవంతం అయ్యిందన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు అనంతరం మంత్రులు, అధికారులు, ఉద్యోగులను ముఖ్యమంత్రి నిన్న అభినందించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత పరిశ్రమల సమాఖ్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖపట్నంలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు.

-----------------------------

జూన్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ –వి.ఎం.ఆర్.డి.ఎ. కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... కైలాసగిరిపై 50 అంతస్తుల ఐకానిక్ భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నం మాస్టర్ ప్లాన్ డిజైన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ను కలిపే ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

-----------------------------

విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో చేనేత రంగంలో 4 వేల 380 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు 7 ఒప్పందాలు జరిగాయని ఆ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. భాగస్వామ్య సదస్సులో నిన్న మంత్రి సమక్షంలో పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒప్పందాలు చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ రాష్ట్రంలో 4వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఇతర సంస్థలు మరో 380 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయని వెల్లడిస్తూ ..

వాయిస్...30 సెకన్లు

-----------------------------

బ్రిటీష్ వారిపై బిర్సా ముండా చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలో బిర్సా ముండా జయంతి కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ.. జన్ జాతీయ గౌరవ్ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రకు ప్రాధాన్యత లభించిందని వివరించారు.

-----------------------------

జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సు మేరకు 1966 నవంబరు 16వ తేదీన భారత ప్రతికా మండలి (ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నవంబరు 16వ తేదీన ప్రతికా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. పత్రికా మండలి పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రతి ఏడాది నవంబరు 16వ

తేదీన సదస్సులు నిర్వహిస్తారు.

---------------------------

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రసార భారతి –సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు ఆకాశవాణి సంగీత సమ్మేళనాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ లు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా హాజరు కానున్నారు. ఆరు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ ప్రతిష్టాత్మక వార్షిక కార్యక్రమంలో శాస్త్రీయ సంగీతం, భక్తి సంగీతం ఆలపించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు కొల్లూరు వందన, మోదుమూడి సుధాకర్ తదితరులు పాల్గొననున్నారు.

---------------------------

ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు రానున్నారు. భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా జన్ జాతీయ గౌరవ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు మండలం, చింతల వీధి వై జంక్షన్ వద్ద, ఏర్పాటు చేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రేపటి నుంచి ప్రత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఆర్.ఆర్. యేసు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరం ప్రత్తి సీజన్‌లో కనీస మద్దతు ధర పొడుగు పింజ క్వింటాలు 8 వేల 110 రూపాయలు, పొట్టి పింజకు 7 వేల 7 వందల 10 రూపాయల చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) ద్వారా ప్రత్తి కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. రైతులు ప్రత్తిని అమ్మడానికి ముందుగా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి గ్రామ వ్యవసాయ సహాయకులతో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని, కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

---------------------------

కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత్, దక్షిణ ఆఫ్రికాల మధ్య క్రికెట్ తొలి టెస్టు జరుగుతోంది. ఓవర్ నైట్ స్కోర్ 93 పరుగులతో మూడో రోజు ఆట ప్రారంభించిన దక్షిణ ఆఫ్రికా 153 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు మొదట ఇన్నింగ్స్ దక్షిణ ఆఫ్రికా 159 పరుగులకు ఆలౌట్ కాగా భారత్ 189 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం 124 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 38 పరుగులు చేసి 4 వికెట్లు నష్టపోయింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

..వాయిస్...30 సెకన్లు

=====================